ముచ్చటైన ప్రేమకథ



చందు సోంబాబు

పేరు పద్మజ వయసు ఇరవై రెండు చదువు మెడిసిన్ రంగు పసిమి ఛాయ అందంలో అజంతా శిల్పం

సన్నం, పొడుగు, కోలమొహం, నొక్కుల జుట్టు, ఖరీదైన చీర, మాచింగ్ కలర్ బ్లౌజు, పల్చని ఆకు చెప్పులు, మెళ్ళో సన్నని గొలుసు, చెవులకి పెద్ద రింగులు, ఒక చేతికి రిస్టువాచీ, మరో చేతికి రెండు బంగారు గాజులు ఇదీ పద్మజ రూపం

కారుంది బెజవాడలో రెండు మేడలూ, హైద్రాబాద్‌లో రెండు మేడలూ వున్నాయి బ్యాంకులో డబ్బు ఎంతుందో తెలీదు. భూములున్న మారాజు, ఆదరాల తల్లితండ్రి

పేరు రంగనాధరావు వృత్తికి కంట్రాక్టరు

ఇద్దరే కూతుర్లు పెద్ద పిల్ల సుమతి డాక్టరు పెళ్ళయింది

రెండోది పద్మజ ఖరీదైన మనిషి కడుపున పుట్టడం ఆడపిల్లకి ఏది జన్మల్లో చేసుకున్న పుణ్యకారణం అని నా నమ్మకం. కారుందని పద్మ చెప్పదు కార్లో షికార్లు కొట్టదు స్నేహితులంటే వల్లమాలిన ప్రేమ అంచేత వాళ్ళతో కలిసి సిటీ బస్సుల్లోనే తిరుగుతుంది సరిగ్గా పద్మజని నేను మొదటిసారి ఎర్రమంజిల్ దగ్గర బస్సులోనే చూసేను పద్మజని ఒకసారి చూస్తే చూపుని తిప్పుకోడం అంత తేలికైన విషయం కాదు పద్మజవేపు దిక్కులు చూస్తూ బస్సు డ్రైవరు బస్సు నెక్కడ గుద్దిపారేస్తాడో అనిపించి భయ

పడిన మాట నిజం పద్మజని చూసేక ఆ పిల్ల గురించి నేను విన్నదంతా నిజమే అనిపించింది

మా ప్రసాద్ పద్మజ వెనుక ఎందుకు పడుతున్నాడో కూడా అర్థం అయింది ప్రసాద్ మా అన్నయ్య కొడుకు బి ఏ ఫైనల్ చదువుతున్నాడు పద్మజ ఎక్కడుంటే ఆ పరిసరాల్లోనే వుంటాడని విన్నాను ప్రేమించడం తప్పని నా ఉద్దేశం కాదు

ఆ మాటకొస్తే నేను రాసినవన్నీ ప్రేమ కథలే అయితే నాకున్న అభిప్రాయం ఒక్కటే అసలు ప్రేమించకూడదు ఒకవేళ ప్రేమించినా ఆ ప్రేమ సుఖాంతం కారాదు నిజ జీవితాల్లో ప్రేమ పెళ్ళిళ్ళు నూటికి తొంభయి తొమ్మిది ఫెయిలవుతాయని నా నమ్మకం

నిజానికి మా వాడికీ పద్మజకీ మధ్య ఆకాశానికీ భూమికీ మధ్య వున్నంత తారతమ్యం వుంది

తోటరాముడ్ని రాజకుమారి వరించిన సందర్భాలున్నాయి కానీ పద్మజ మావాడ్నేమీ ప్రేమించలేదు తన వెంటపడే ఓ పోకిరీగాడనే అభిప్రాయం వుంది అతను రాసిన ఓ అరడజను ప్రేమలేఖల్ని చూస్తుండగానే చించిపారేసిందని ప్రసాద్ ఫ్రెండ్ సురేష్ నాకు చెప్పాడు అసలు పద్మజ గురించి నాకు చెప్పింది కూడా సురేషేను

అప్పుడు మావాడ్ని నిలదీసి అడిగాను. ప్రసాద్ నీకంటే ఏడేళ్ళు చిన్నవాడు అంచేత నా దగ్గర ఓ ఫ్రెండ్‌లా వుంటాడు అన్నకొడుకు గనక వాడు నేనంటే భయపడి అణగి మణగి వుండాలని నేను ఎప్పుడూ అనుకోను

ప్రసాద్ నా మాటల్ని తేలిగ్గా కొట్టిపారేసి అన్నాడు

"నీ కెవరో కట్టుకథ చెప్పారు బాబాయ్‌! భలేవాడివి నేను ప్రేమించడమేమిటి? నయం ఇంకా ఈ సంగతి అమ్మకి చెప్పావు కాదు," అన్నాడు

నేను వృత్తిరీత్యా లాయర్ని వాడు నాకు అబద్ధం చెప్పడం నా క్కొంచెం కష్టం కలిగింది వాడ్ని బుజ్జగించి అడిగేను

"ఫర్లేదు ఇదేమీ నేరం కాదు నువ్వు నిజం చెబితే నా సహకారం నీకుంటుంది" అన్నాను వాడితో ఎలా మాట్లాడితే నిజం చెబుతాడో నాకు తెలుసు

ప్రసాద్ కొద్దిసేపు తలొంచుకున్నాడు గోళ్ళు కొరికాడు నాకేసి అదోలా అనుమానంగా చూసేడు ఆఖరికి అన్నాడు

"నిజమే బాబాయ్! నేను పద్మజని బాగా లైక్ చేస్తాను" అన్నాడు.

"ఒట్టి లైకింగేనా? లేక లవ్వా?" అడిగేను

"ఏమో? అదేమిటో నాకు తెలీదు కాని పద్మజని చూడందే మాత్రం నేను వుండలేను" అన్నాడు

"నాకోసారి ఆ అమ్మాయిని చూపిస్తావా?" అడిగేను

నేను పద్మజని అప్పటికే చూశాను. అయితే అది వాడికి చెప్పలేదు నేను

"పద్మజకి నువ్వు బాగా తెలుసు" అన్నాడు

"ఎలా?"

''నీ కథలంటే చాలా ఇష్టం పద్మజకి ''

ఆ మాట వినగానే నాకు ఏనుగెక్కినంత సంబరం కలిగింది రచయితలు అల్పసంతోషులని నాకు తెలుసు ఎవరైనా మేము ఏ చెత్త రాసినా బాగుందంటే వాడి ముక్కు మొహం తెలీకపోయినా కూర్చోబెట్టి కాఫీ యిచ్చి పంపందే తోచదు అందునా పద్మజ లాంటి అందాలరాసికి నా కథలంటే ఇష్టం అని విన్నప్పుడు వంద ములగ చెట్లెక్కిపోయినా ఆశ్చర్యం లేదు

''ఆ విషయం నీకెలా తెలుసు?'' అడిగేను

ప్రసాద్ నవ్వాడు

''పద్మజ విషయాలు ఎప్పటికప్పుడు నాకు తెలుస్తాయి. సంగీతం మాష్టారబ్బాయితో అందిట ''

''పాటలు కూడా పాడుతుందా!'' అడిగేను

''రేడియోలో కూడా పాడింది'' అన్నాడు

ప్రసాద్ భుజం తట్టి చెప్పాను

''నువ్వేం దిగులుపడకు మిగిలిన విషయాలు నేను చూసుకొంటాను కానీ ఓ షరతు ఆ పిల్లకి నువ్వంటే ఇష్టమైతే నే సహాయం చేస్తాను లేకపోతే నువ్విక ఆ ఛాయలకి కూడా వెళ్ళకూడదు'' అన్నాను

''అలాగే'' అన్నాడు ప్రసాద్

తర్వాత వాడు వెళ్ళిపోయాడు

ప్రసాద్ నా అన్న కొడుకు వాడి బాగోగులు చూడవలసిన అవసరం నా పైన లేకపోలేదు ప్రసాద్ ఫ్రెండ్ గోపీ వున్నాడు గోపీ మాటలు చెప్పినంతగా ఏ పనినీ చేతల్లో చేసేరకంకాదు మా వదిన దగ్గర వున్నదీ లేనిదీ పోగు చేసి ప్రసాద్ గురించి చెప్పాడు దాంతో ఆవిడగారు కంగారుపడిపోయి నన్ను పిలిపించి,

''చూడ్నాయనా, వాడు మాకెంతో నీకూ అంతే' మా మాటకంటే నీమాటే వింటాడు ఎలాగైనా ఆపిల్ల వెనుక తిరక్కుండా చూడు'' అని బ్రతిమిలాడింది వదినకి మేనకోడల్ని కోడలిగా చేసుకోవాలని కోరిక వదినకి అలాగే అని హామీ ఇచ్చాను ఆవిడిచ్చిన కాఫీ తాగి బయట పడ్డాను

కోర్టుకి శెలవలు వచ్చేవాళ్ళు కూడా లేకపోవడంతో నాకు తీరుబడి ఎక్కువైపోయింది

తోచని వ్యవహారంగా ఇందులో ప్రవేశించాను ఇప్పుడిదో పెద్ద హెడేక్ అయిపోయింది వదినకి తెలీనంతవరకూ ఓలా వున్న విషయం ఇప్పుడు చిక్కులో పడిపోయింది ప్రసాద్ తరపున వకాల్తాపుచ్చుకొని ఏమన్నా చేస్తే నన్ను, అన్నయ్యా, వదినా వుతికి పారేస్తారు అలా కాకపోతే ప్రసాద్‌గాడు ఏడుస్తాడు పైగా వాడసలే ముక్కోపి వాడికేమన్నా ఓ పని చేద్దామని కనక అనిపిస్తే ఆ పనిని చేసేవరకూ నిద్రపోడు తగ్గట్టుగా వాడి నేస్తాలందరూ కూడా దాదాలే దాదాలంటే నాకు భయమని కాదు ఎలాంటివాడి కొమ్ములైనా విరిచేసే శక్తి నా వృత్తికుంది

ప్రసాద్‌కు నేను మాటిచ్చాను దాంతో



అతని స్నేహితులు నా దగ్గరికి రాక పోకలు ఎక్కువ చేశారు జనం ఏకారణం చేత వచ్చినా చూసేవాళ్ళకి ప్లీడర నే వాడిల్లు హడావిడిగా కనబడ్డం మంచిది

ప్రసాద్ అసలు కాలేజీకి పోవడం లేదని గోపీ చెప్పాడు మెడికల్ కాలేజీకి ఎదురుగా నిరీక్షణలో గడిపేస్తున్నాడు గంటల తరబడి బస్టాపుల్లో నించోడం, సినిమా హాల్స్ దగ్గర కాపలా కాయడం, రవీంద్రభారతిలో ఏ పాటకచ్చేరి జరిగినా వెళ్ళి హాజరై పోవడం చేస్తున్నాడు

—నాకిది బొత్తిగా నచ్చలేదు

వాడు పాడై పోవడం కళ్ళతో చూస్తూ వూరుకోనేదెలా? వాడు పూర్తిగా పాడై పోక ముందే ఓ దార్లో పెట్టాలని నిశ్చయించుకున్నాను

ఉదయం కాఫీ తాగి పేపరు చూస్తున్నాను

"ప్లీడరుగారున్నారా?" అన్న మాటలకి తలెత్తి చూసేను నా కళ్ళని నేను నమ్మలేకపోయాను

నేను కళ్ళ ముందే ఉన్నా ప్లీడరుగా రున్నారా అని అడుగుతుంటే వళ్ళు మండి పోయింది కానీ నేను వయసుకి కుర్రాడ్ని మామూలుగా రోడ్డుమీది కెళితే ఏ కాలేజీ స్టూడెంటో అనుకుంటారే తప్ప లాయర్నని మాత్రం ఎవరూ అనుకోరు

"ప్లీడరుగారితో పనేమిటి?" అడిగేను

"కోర్టు పని కాదు" అంది పద్మజ మిగిలిన ఇద్దరూ కిసుక్కున నవ్వేరు

"మీరేం పని మీద వచ్చారు?" అన్నాను

"వివరాలు మీ కెందుగ్గానీ, ప్లీడర్ గార్ని పిలవండి" అంది

నా వళ్ళు మండింది

"నేనే లాయర్ రావుని" అన్నాను

"మీరా? నయం ప్లీడరుగారంటే మీ నాన్నగారనుకొన్నాను" అంది

"ఇంకా తాతగారనుకోలేదు నమ్మకం లేకపోతే ఆ గోడకున్న ఫొటోకేసి

చూడండి'' అన్నాను

పద్మజ ఫొటోకేసి చూసి నవ్వింది పద్మజ నవ్వినప్పుడు బుగ్గలు సొట్టలు పడ్డాయి

''మీరింత చిన్నవాళ్ళనుకోలేదు'' అంది

''మీకంటే చిన్నవాడ్ని కాదుగా'' అన్నాను

పద్మజ నవ్వింది

''నా మీరు రాసే కథలంటే చాలా ఇష్టం. అందుకని ఓసారి మిమ్మల్ని కలుసుకోవాలని వచ్చాను'' అంది ఆ మాటలకి నేను గాలిలో తేలిపోయాను పద్మజ ప్రసాద్ ప్రియురాలన్న సంగతి కూడా మర్చిపోయాను

''కేవలం చూడ్డానికే వచ్చేరా?'' అడిగాను

పద్మజ కాస్త సిగ్గుపడింది తర్వాత అంది

''నాకూ కథలు రాద్దామనుంది మీరు రాసిన కథలు దాదాపు అన్నీ చదివేను నాకు నచ్చే కథలు రాసేవారి దగ్గరే శిక్షణ పొందడం మంచిదనిపించింది''

''తప్పకుండా, కానీ ఏ రచయిత్రి దగ్గరో అయితే బాగుండేది'' అన్నాను పద్మజ చురుగ్గా చూసింది ''ఏం మీకు అభ్యంతరమా?'' అంది

''అబ్బెబ్బె' అలాంటిదేమీ లేదు. రాసినవుంటే ఇవ్వండి చూస్తాను'' అన్నాను పద్మజ రెండు కథలిచ్చింది రెండూ వారపత్రికలనుంచి తిరిగొచ్చాయని చెప్పింది పద్మజని చూస్తే వారపత్రికలే వెనక్కొచ్చేస్తాయని నాకు తెలుసు గ్లామర్‌ని పెంచుకొని కథలు రాస్తున్న వాళ్ళు నాకు తెలుసు

''మీ మిసెస్‌ని పరిచయం చెయ్యరా?' అనడిగింది

నేను లోపలికెళ్ళి ఫ్లాస్కులో కాఫీని నాలుగు కప్పుల్లో సర్దించి పని కుర్రాడితో మోయించుకొచ్చాను

''సారీ నాకింకా పెళ్ళి కాలేదు'' అని చెప్పాను

''చాలా శ్రమిచ్చాం సారీ'' అంది పద్మజ

''మరేం ఫర్లేదు వస్తుంటారుగా'' అన్నాను

''మీ శిష్యురాలిగా చేరాక రాక తప్పదుగా'' అంది

నవ్వేను

పద్మజ వెళ్ళిపోయాక ప్రసాద్ వచ్చాడు వాడి మొహంలో నెత్తురుచుక్కలేదు మాట్లాడకుండా నా ముందు కూర్చున్నాడు పద్మజ యిచ్చి వెళ్ళిన కథలందించాను

''నేను చెప్పలా నీ కథలంటే ఇష్టం అనీ'' అన్నాడు

నేను మాట్లాడలేదు.

''నన్ను గురించేమైనా అడిగిందా?'' అడిగాడు

''లేదు'' అన్నాను

వాడ్ని చదవాలనిపించింది

''పద్మజ పెళ్ళట'' అన్నాను

ప్రసాద్ బాంబు పడ్డట్టు వులిక్కిపడ్డాడు

''నిజంగానా?'' అడిగాడు

''నిజమే'' అన్నాను

పిడికిలి బిగించి అన్నాడు

"పెళ్ళి పందిరికి నిప్పుపెట్టి పద్మజని ఎత్తుకెళ్ళిపోతాను" అన్నాడు

"రాజుల కాలం కాదిది కేసు పెట్టి జైల్లో పారేస్తారు" అన్నాను

"పద్మజ నాదికాకపోతే తనని చంపి, నేను ఛస్తాను అంతేకానీ మరొకళ్ళకి మాత్రం పద్మజని దక్కనివ్వను" అన్నాడు

"అలా స్లేవ్ అవకు కిడ్నాప్‌చేసి తీసికెళ్ళినంత మాత్రంచేత ఆ పిల్ల నీకు లొంగిపోతుందా? అది పెద్ద నేరం కూడానూ"

"ఇష్టమై వచ్చిందని చెప్తాను"

"పద్మజ మేజర్ రిపోర్టు చేస్తుం దనుకో"

ప్రసాద్ నాకేసి విసుగ్గా చూశాడు

"అందుకే నీ సహాయం అడిగింది నాకివన్నీ తెలియవు ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్?" అన్నాడు

"శాంతంగా ఉండు పద్మజ పెళ్ళి మాట అబద్ధం"

ప్రసాద్ శాంతించాడు వాడి తత్వం నాకు బాగా తెలుసు వదిన గారాభం ఎక్కువ చెయ్యడంచేత మూర్ఖత్వం ఎక్కువై పోయింది నిజంగా పద్మజకి పెళ్ళి జరిగితే అన్నట్టుగానే పెళ్ళిపందిరికి నిప్పు పెట్టగల దిట్ట చిరంజీవి ప్రసాద్

—పద్మజ రాసిన కథలు చదివేను వాగున్నాయి కాస్త గైడ్‌చేస్తే దారిలో పడుతుందనిపించింది రాసేవాళ్ళంటే నాకిష్టం అందునా ఆడపిల్లలు కథలు రాస్తే సరదా ఎక్కువ వాళ్ళకి కావల్సిన ప్రోత్సాహం కూడా ఇస్తాను

పద్మజ మరో రెండు రోజుల తర్వాత ఒంటరిగా వచ్చింది

"మిలట్రీ తోడు లేకుండా వంటరిగా వచ్చారే?" అన్నాను

"ప్రతి విషయం అందరికీ తెలీడం నాకిష్టంగా వుండదు" అన్నది

"అంటే మీరు కథలు నేర్చుకొంటు న్నారని అందరికీ తెలీకూడదా?" అన్నాను

పద్మజ సన్నగా నవ్వింది పద్మజ నవ్వితే గలగలమని పారే సెలయేరు తుళ్ళిపడినట్టుగా వుంటుంది

"నేను కథలు నేర్చుకోడానికి కాదు వచ్చింది కథలు రాయడం నేర్చుకోడానికి" అంది ప్రతి మాటనీ సూక్ష్మ దృష్టితో అవగాహన చేసుకొంటుంది పద్మజ పద్మజతో మాట్లాడుతూంటే నాకు బొత్తిగా టైం తెలీదు

"మీ రెండు కథల్ని మాసపత్రికల కిచ్చాను పై నెల్లో పబ్లిష్ అవుతాయ"ని చెప్పారు

"చాలా థ్యాంక్స్" అంది

పదిహేను రోజులు గడిచేయి అప్ప టికి నాలుగుసార్లొచ్చింది పద్మజ ఎప్పటి కప్పుడు ప్రసాద్ విషయం ప్రస్తావించాలి అనుకొంటూనే అశ్రద్ధ చేసాను ప్రసాద్ సతాయింపు ఎక్కువైంది

"దాబాయ్ నువ్వేదో నాటకం ఆడుతు న్నావ్. పద్మజ ఇన్నిసార్లు వచ్చినా నువ్వేం మాట్లాడలేదంటే నిన్ను గురించి నేను ఏమనుకోవాలి? నీ లాయర్ తెలివి నా దగ్గరొద్దు దయచేసి త్వరగా విషయం తేల్చేయ్" అన్నాడు సిగరెట్ వెలిగించి అన్నాను

"నువ్వింకా కుర్రాడివి చదువుకొంటు న్నావ్ ఉద్యోగం లేదు పద్మజ నువ్వంటే ఇష్టపడి వచ్చేసినా ఆ పిల్లని పోషించే శక్తి నీకుండాలి ప్రేమకి మనసుంటుంది కానీ పోషించలేదు"

నా మాటలు వాడి చెవి కెక్కలేదు "అసలు నీ సహాయం అడగడం నాదే తప్పు," అన్నాడు ఆఖరికి

"తొందరపడకు నన్నర్థం చేసుకో" అన్నాను ప్రసాద్ రోషంగా చూశాడు ప్రసాద్ స్వతహా తెలివైనవాడు ప్రేమ విషయంలో ఇన్ని అవలక్షణాలెలా ఏర్ప డ్డాయో బోధపడలేదు

పద్మజ కథలు అచ్చయ్యాయి ఆ రోజున పద్మజ ఫోన్ చేసింది తన బర్త్ డే అని, తన ఫ్రెండ్స్‌కి నన్ను చూపిస్తా నని ప్రామిస్ చేశాననీ చెప్పింది నేను బయలుదేరబోతూండగా క్లైంట్స్ వచ్చారు మా సీనియర్ వూళ్ళో లేకపోవ డంతో వాళ్ళతో కూర్చోక తప్పిందికాదు ప్రతిక్షణం పద్మజ ఆహ్వానం గుర్తు కొస్తున్నా కదల్లేకపోయాను మర్నాడు పొద్దున ఫోన్ చేశాను నా గొంతు గుర్తు పట్టి వెంటనే ఫోన్ పెట్టేసింది పద్మజకి నా మీదచాలా కోపం వచ్చిందని గ్రహిం చాను పద్మజ వాళ్ళింటికి వెళ్ళి నచ్చ చెప్పాలనిపించింది నిజానికి ఆ పిల్ల విషయంలో నాలో బలహీనత ఏర్పడి పోతోంది మూడు రోజుల తర్వాత పద్మజే వచ్చింది

"కోపం పోయిందా?" అడిగేను

"మీ మీద కోపం వస్తే మాత్రం నేనేం చెయ్యగలను గనుక" అంది

"అంటే ఏమన్నా చెయ్యాలనుందా" అన్నాను ఛలోక్తిగా

"చాల్లెండి పెద్ద" అంది తోటలో కూర్చున్నాం పద్మజకి ప్రసాద్ గురించి



పూసగుచ్చినట్టు చెప్పేశాను అంతా విని పద్మజ నవ్వింది

"ఎండా, వానా ప్రమేయం లేకుండా నేను నవ్వితే చాలు వెనకపడొచ్చేస్తాడు" అంది

"మీకతనిమీదున్న అభిప్రాయం ఏమిటి?"

"నథింగ్ అల్లరికుర్రాడంతే" అంది

"ప్రసాద్ నీ పిచ్చిలో పడి పాడై పోతున్నాడు"

"బాగుంది నేను నా వెంట పడమని గానీ, పాడై పొమ్మనిగానీ చెప్పలేదే" అంది

"అతను బాగుపడ్డం ఇష్టమేనా?"

"అతను చెడిపోతే నాకేం వస్తుంది?" అంది

"అయితే నాకో సహాయం చెయ్యాలి"

"ఏమిటి?" అడిగింది

"మీరంటే వాడికి విరక్తి కలగాలి"

"ఎలా?"

"చెప్తాను కానీ మీ కోపం రాకూడదు"

"రాదు చెప్పండి"

"మనిద్దరం కలిసి సినిమా కెళ్ళాలి"

పద్మజ ఫక ఫక మని నవ్వేసింది

"సినిమాకా?" అంది

"అవును పరాయి పిల్లని సినిమాకి రమ్మని అడిగితే చెంప ఛెళ్ మంటుంది" అన్నాను

"మీకు నేను పరాయిగా అనిపిస్తున్నా నేమోగానీ మిమ్మల్ని నేను మాత్రం గురువుగా భావిస్తున్నాను మీ రెక్కడికి రమ్మన్నా వస్తాను తెలుసా?" అన్నది పద్మజ

"మెనీ థాంక్స్" అన్నాను ఆనందంగా

మర్నాడు మాట్నీకి జమేరుద్ లో 'రెడ్ సన్'కి వెళ్ళాం ప్రసాద్ దూరంగా నించుని మా ఇద్దర్నీ చూశాడు ఆ క్షణంలో వాడికేసి చూడాలంటే చాలా గిల్టీగా ఫీలయ్యాను వాడికి నేను హాట్ ఇస్తున్నానని తెలుసు. వాడెంత బాధ పడతాడో, ఆ టార్చర్ ఎలా ఉంటుందో నాకు తెలుసు

సినిమా జరుగుతున్నా మనసు తెర పైకి పోడంలేదు మధ్య మధ్య భుజం నాకు తగులుతోంది ఆ క్లాసులో జనం ఆట్టేలేరు చీకటిలో పద్మజని చుట్టేసి గట్టిగా ముద్దు పెట్టుకోవాలనిపించింది కానీ అంతసాహసం చెయ్యలేకపోయాను ఆడదంటే ఏమిటో తెలిసిన బ్రహ్మచారిని నేను నాకు చాలా మంది ఆడపిల్లలతో స్నేహం వుంది మనసు పైత్యగించినా నాకుగా నేను చొరవ చెయ్యను అటు నుంచి రెస్పాన్స్ వస్తేగానీ అసలు కధలో కడుగు పెట్టను పద్మజ నా చేతిమీద కొట్టింది

"అతనెవరు హీరో నెందుకు కొట్టాడు" అని అడిగింది

ఇంగ్లీషు సినిమాలు నేను చాలా ఈజీగా ఫాలో అవుతాను అదే హిందీ పిక్చరయితే గొడవలో పడిపోతాను పక్కన కూర్చున్న శీతారామయ్య ఎవరన్నాగానీ వాడా సన్నివేశం ఏమిటో చెప్పేవరకూ చంపేస్తాను పద్మజకి సమాధానం చెప్పి తృప్తిపరచాను పద్మజ నవ్వి అన్నది

"పోజు కోసం తీసుకొచ్చారనుకున్నాను మీకు ఇంగ్లీషు సినిమా ఫాలో కావడం తెలుసన్నమాట" అంది

సినిమా అయిపోయింది బయట ప్రసాద్, సురేష్, సుధాకర్, గోపీ నించున్నారు నన్ను తినేశేలా చూస్తున్నారని గ్రహించాను.

"అడుగో మీ చిరంజీవి ప్రసాద్ మన మీద దాడి చేస్తాడేమో" అంది నవ్వుతూ

నేను వాళ్ళకేసి చూళ్ళేదు

ఆటో ఎక్కాం పద్మజ అడిగింది

"ప్రసాద్ నా వెనక పడ్డం మానే వరకూ, మనం ఇలా సినిమాలు మాడాల్సిందేనా ఆటో లెక్కాల్సిందేనా" అని

"మా వాడు బారిలో పడితే మాత్రం సినిమాలు చూడకూడదా" అన్నాను

"నయం నన్ను మీతో వుండిపొమ్మన లేదు" అంది

నేను నవ్వేను ఇద్దరం తాజ్ లో కాఫీ తాగేం పద్మజ వెళ్ళిపోయింది

ఆ రాత్రి ప్రసాద్ తన జట్టుగాళ్ళతో వచ్చాడు వాళ్ళకి నాపైన తగని కోపంగా ఉందని గ్రహించాను

"నువ్వింత నమ్మక ద్రోహం చేస్తావనుకోలేదు" అన్నాడు ప్రసాద్

నేను మాట్లాడలేదు సిగరెట్టు వెలిగించి ఎదురుగా ఉన్న హోటల్నుంచి టీ తెప్పించాను మాట్లాడకుండా త్రాగారు సురేష్ అన్నాడు

"మీరు చాలా తప్పు చేశారు బాబాయ్ గారూ"

"ఎన్నన్నా చెప్పండి సార్ కధలు చెప్పి పద్మజని లోబరుచుకున్నారు"

అన్నాడు సుధాకర్ నాకు కోపం వెర్రిగా వచ్చింది

"షటప్ అట్టే మాట్లాడకండి. ఓ పక్క మెడపట్టి బయటికి గెంటుతోంటే చూరు పట్టుకొని వేళ్ళాడినట్టుగా వుంది రౌడీలని అభిప్రాయంతో వున్న ఆ అమ్మా యిని మీలో ఒకడ్ని ప్రేమించమని చెప్పే దెలా? అసలు ప్రేమనేది స్వతహాగా కల గాలి ఒకళ్ళు చెబితే ప్రేమిస్తే అది ప్రేమ కాదు పచ్చి నాన్సెన్స్ అంటాను" అన్నాను

"అయితే ముందు వాడికి మాటెందు కిచ్చారు?" సురేష్ అడిగాడు

"మాట తోపాటు షరతు కూడా ఉంది రెండు వైపులా ఇష్టం వుంటేనే నేను సహకరిస్తానని చెప్పాను పద్మజకి ప్రసా దంటే ఇష్టంలేదు" అన్నాను

"అయితే మిమ్మల్ని ప్రేమిస్తోందా?" అన్నాడు గోపీ నేను నవ్వేను

"నేను అడగలేదు" అన్నాను

"నేను ముందే చెప్పాను కేసు మీ బాబాయి దగ్గరకి తీసుకెళ్ళకని ఆడపిల్లల విషయంలో మీ బాబాయ్‌ది పెద్ద చెయ్యని చెప్తే విన్నావుకాదు" అన్నాడు సుధాకర్ అలా తిట్టి తిట్టి అలసిపోయి వెళ్ళిపో యారు ము(గ్గు)రాళ్ళంతాను

వదినకి మర్నాడు జరిగినదంతా చెప్పాను మెల్లగా ప్రసాద్‌కు నేను నచ్చ చెబుతానని నాకు మాటిచ్చింది వదిన

సాయంత్రం పద్మజ వచ్చింది ప్రసాద్ చేసిన దాడి వివరాలు పద్మజకి చెప్పాను నవ్వింది

"పోన్లెండి కొట్టలేదు" అంది.

"గుండెలా? చెరువా?" అన్నాను

"మీ గుండె చెరువో సముద్రమో నాకు తెలీకపోతే కద పదండి టాంక్‌బండ్ వరకు పోదాం" అంది పద్మజ

ఆహ్వానంతో బయట కొచ్చాను ఎప్పుడు లేంది పద్మజ కారు సొంతంగా డ్రైవ్ చేసుకొచ్చింది

పద్మజ పక్కనే కూర్చున్నాను కారు మెత్తగా సాగిపోతోంది

"టాంక్‌బండ్ చేరేలోగా ఈ చీటీ చదవండి" అంది

అందులో ఇలా వుంది

రావుగారూ,

నాకు మీ కథలంటే చాలా ఇష్టం కానీ ఇప్పుడు మీరే నా ప్రాణం అని తెలుసుకున్నాను

ఏమంటారూ? అవునా?

మీ
పద్మజ

నాకు బుర్ర తిరిగిపోయింది పద్మజ మొహంలోకి చూశాను పద్మజ దృష్టి రోడ్డు మీద ఉంది

అందం, అందంతోపాటు సిరినీ తీసు కొచ్చే లక్ష్మీదేవిని కాదని ఎలా చెప్పను?

పద్మజ భుజంపైన చెయ్యి వేశాను

కారు పార్కు చేస్తూ పద్మజ నా కళ్ళ ల్లోకి చూసింది

ఆ కళ్ళల్లో పెళ్ళిపందిరి, పెళ్ళి పంది రిలో పీటలపైన నేను, నా పక్కగా పద్మజ కాస్త దూరంలో ప్రసాద్ వాడి ప్రక్కగా సుధాకర్, గోపీ, సురేష్, మండుతున్న దివిటీలు పట్టుకొని పందిరికి నిప్పు పెడుతూ కనబడ్డారు. ★